క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి వసంతోత్సవం



స్వామివారికి పూజలు చేస్తున్న వేదపండితులు

జామి: మండలంలో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఆరాధన, హోమాలు, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి చక్రస్నాన ఉత్సవం నిర్వహించగా.. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసేందుకు వచ్చిన ఎస్పీ దీపిక

గజపతినగరం: గజపతినగరం సర్కిల్ పరిధిలో నమోదైన వివిధ రకాల కేసుల పరిష్కారం వేగవంతం చేయాలని, పెండింగ్ కేసులు లేకుండా చూడాలని జిల్లా ఎస్పీ దీపిక ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, వారి పరిష్కారంపై ఆరా తీశారు. పెండింగ్ కేసులుపై దృష్టి సారించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ఎన్.వి.ప్రభాకరరావు, ఎస్సై యు.మహేష్, తదితరులు ఉన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి



కెరటాంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: రైతులకు అవసరమైన పనులను గుర్తించి ఉపాధిహామీ పథకం కింద చేపట్టాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు అన్నారు. మండలంలోని కెరటాం, నెలివాడ, అంబటివలస గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొలాలకు వెళ్లే దారులతో పాటు సాగునీటి కాలువల్లో ఉన్న తుప్పలను తొలగింపు వంటి పనులు గుర్తించి చేపట్టాలన్నారు. వర్షాలు ప్రారంభమైనందున ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ బి.కృష్ణవేణి, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

సాగునీరు అందక ఇబ్బందులు



పెదమానాపురం వద్ద నమ్మాదికట్ట ఛానల్‌ను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రాతి చెరువుకు ఏడొంపుల గెడ్డ నుంచి నీరు రాకుండా కాలువను పూడ్చేయడంతో సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్‌లో రైతులు సాగునీటి కోసం ఇబ్బంది పడకుండా చూడాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ ఏఈ రూప, హైవే ఏఈ సురేష్ శుక్రవారం ఏడొంపుల గెడ్డ నుంచి పెదమానాపురం రాతి చెరువుకు నీరు వచ్చే నిమ్మాది కట్ట ఛానెల్‌ను పరిశీలించారు. కాలువను ఆనకుని ఉన్న ఆక్రమణలు తొలగించి సాగునీటి ఇబ్బందులు తొలగిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని రైతులు అధికారులను కోరారు.

ముళ్లపొదల తొలిగింపు

దత్తిరాజేరు: కోమటిపల్లి నుంచి గర్భాం వెళ్లే రోడ్డులో వింధ్యవాసి పంచాయతీ పరిధిలో పోతల గెడ్డ వద్ద రోడ్డుపైకి విస్తరించి ఉన్న ముళ్లపొదలను శుక్రవారం తొలగించారు. రోడ్డుపైకి ముళ్లపొదలు వ్యాపించి ప్రమాదకరంగా మారాయి. స్థానిక ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడు, సర్పంచ్ రంభ చంద్రశేఖర్ స్పందించి జేసీబీ సాయంతో వాటిని తొలగించారు. దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులు వారిని అభినందించారు.

చెరువులో పూడికల తొలగింపు

మెరకముడిదాం: మండలంలోని ఉత్తరావల్లి గ్రామంలో మంచినీటి కోనేరు తుప్పలతో నిండిపోయి ఉండేది. ఈ చెరువు దుస్థితిని చూసి గ్రామానికి చెందిన యువకులంతా చెరువును బాగుచేసుకోవాలని నిర్ణయించారు. వెంటనే రంగంలోకి దిగి చెరువులో పెరిగిన తుప్పలను తొలగించారు. ప్రొక్లయిన్ సాయంతో చెరువులో పూడికలు తొలగించి లోతు చేశారు. యువకుల కృషిని గ్రామస్తులు అభినందించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



బొండపల్లి: యోగాసనాలు వేస్తున్న గొట్లాం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. మనసును, శరీరాన్ని ఏకం చేసేది యోగా. ప్రతిరోజు యోగాసనాలు వేయడం ద్వారా ఏకాగ్రతను, సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని అన్నారు. అనంతరం విద్యార్థులు, యువతతో కలిసి యోగాసనాలు సాధన చేశారు. – సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి రూరల్: గరివిడి వెటర్నరీ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



గజపతినగరం: స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో యోగా సాధన చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జ్ బి.కనకలక్ష్మి, న్యాయవాదులు



మెరకముడిదాం: చినబంటుపల్లి పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం



లక్కవరపుకోట: కొట్యాడ హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



బొండపల్లి: వెలుగు కార్యాలయంలో..



గంట్యాడ: రామవరంలో ర్యాలీ చేస్తున్న ఎంపీపీ హైమావతి, తదితరులు




గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది, విద్యార్థులు



చీపురుపల్లి: శ్రీనివాసా జూనియర్ కళాశాలలో..



చీపురుపల్లి: పోలీస్ సర్కిల్ కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న సీఐ, ఎస్ఐ, సిబ్బంది



కొత్తవలస: మంగళపాలెం సెయింట్‌ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు



వేపాడ: వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



జామి: జామి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



కొత్తవలస: వాగ్దేవి కళాశాలలో విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న యోగా గురువు సిహెచ్.అప్పారావు



దత్తిరాజేరు: కె.కొత్తవలస గురుకుల పాఠశాలలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



దత్తిరాజేరు: ఇంగిలాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో యోగాసనాలు వేయిస్తున్న కార్యకర్త



శృంగవరపుకోట: మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో యోగా సాధన చేస్తున్న న్యాయమూర్తి వాణి



శృంగవరపుకోట: భవానీనగర్ డీవీఎల్ స్కూల్‌లో విద్యార్థుల యోగాసనాలు



శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సమష్టి కృషితోనే అభివృద్ధి

• ఎంపీపీ వెంకటనర్సమ్మ



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ

చీపురుపల్లి: మండలంలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషి అవసరమని ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల, గ్రామ స్థాయిలో అధికారులు, సర్పంచ్లు, ఎంపీటీసీలు సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ముందు చూపుతో ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారన్నారు. ఫలితంగా రైతులు విత్తనాల కోసం పరుగులు పెట్టాల్సిన అవసరం లేకుండా ఉన్న ఊర్లోనే లభిస్తున్నాయన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సచివాలయ సిబ్బంది స్థానిక నాయకులతో కలిసి గ్రామాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అంతకుముందు శాఖలు వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైస్ ఎంపీపీ కరిమజ్జి వెంకటరమణమ్మ, ఎంపీడీఓ డి.శ్వేత, అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

• ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ



విద్యాశాఖ ప్రగతి నివేదికను వివరిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

కొత్తవలస: పంచాయతీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మండల సర్వసభ్య సమావేశం చక్కని వేదిక అని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అన్నారు. ఎంపీపీ అధ్యక్షతన, ఎంపీడీఓ ఎస్.రమణయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మండల సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల ప్రగతి నివేదికలను ఆయా శాఖల అధికారులు సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో రైతులకు రాయితీలపై స్ప్రింక్లర్లు, పైపులు అందించనున్నట్లు ఉద్యానవన అధికారి వివరించారు. రాజుపాత్రునిపాలెంలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ కర్రి శ్రీను ఎంఈఓను కోరారు. అలాగే కొత్తవలస మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో దాతల సహకారంతో షెడ్డు, బర్నింగ్ స్టెచ్చర్ ఏర్పాటుకు అనుమతివ్వాలని ఎంపీటీసీ సూర్యనారయణశాస్త్రి కోరారు. రైతులకు పంట రుణాలు మంజూరులో బ్యాంకు అధికారులు కొర్రీలు పెడుతున్నారని చీడివలస సర్పంచ్ వాపోయారు. అప్పన్నపాలెంలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని స్థానిక సర్పంచ్ రాములమ్మ అధికారులను కోరారు. అలాగే గత ప్రభుత్వం అందించిన చేయూత పథకం కింద మహిళలకు పూర్తిస్థాయిలో సాయం అందలేదని జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకొని మహిళలకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సి.చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీలు మేలాస్త్రీ అప్పారావు, కర్రి శ్రీను, వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

వేపాడ: మండలంలో బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 6,7,8,9వ తరగతుల్లో ఉన్న మిగులు సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీఎం ఫ్లోరెన్స్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 25 లోగా ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహించి, మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ 8985883015లో సంప్రదించాలని కోరారు.

భారీ వర్షం



వేపాడ: వేపాడలో కురుస్తున్న వర్షం

కొత్తవలస/లక్కవరపుకోట: కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొత్తవలస రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరదనీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెరువుల్లో నీరు చేరడంతో ఖరీఫ్ సాగుకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు.

నువ్వుసాగుపై రైతుల ఆందోళన

వేపాడ: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో నువ్వుసాగుకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వారంలో రెండు సార్లు భారీ వర్షం కురవడంతో నువ్వు పంటసాగు భూముల్లో నీరు చేరింది. నీరు నిలిచి ఉంటే పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు అంటున్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ

గజపతినగరం రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు కావాల్సిన వరి విత్తనాలను రైతుభరోసా కేంద్రాల ద్వారా రాయితీ ధరకు అందిస్తున్నామని మండల వ్యవసాయశాఖ అధికారి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని పాతబగ్గాం గ్రామంలో రైతులకు శుక్రవారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 19 ఆర్‌బీకేల ద్వారా మొదటి దశలో 2200 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీకి సిద్ధం చేసినట్లు చెప్పారు. రెండో దశలో పంపిణీకి అవసరమైన విత్తనాలకు ఇండెంట్ పెట్టామన్నారు. 30 కిలోల బస్తాకి రూ.300 వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు విత్తన మొలక శాతాన్ని పరీక్షించి తీసుకువెళ్లాలని కోరారు. నారు వేసేముందు కిలో విత్తనానికి సూడోమోనాస్ 8 గ్రాములు, కార్బండిజం 3 గ్రాములు చొప్పున కలుపుకుని విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు.

వేపాడ: మండలంలోని బానాది, ఎస్.కె.ఆర్.పురం, వల్లంపూడి, ఆతవ తదితర గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న రైతులకు వీఏఏలు రాయితీపై విత్తనాలు అందజేశారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేలో సంప్రదించాలని కోరారు.



వేపాడ: బానాదిలో రైతులకు వరి విత్తనాలు అందచేస్తున్న గ్రామపెద్దలు, నాయకులు

ప్రతి రైతుకూ విత్తనం అందేవిధంగా చూడాలి

గంట్యాడ: ప్రతి రైతుకూ విత్తనం అందేవిధంగా చూడాలని ఎంపీటీసీ పాటుపురెడ్డి భవాని అన్నారు. మండలంలోని పెదవేమలి గ్రామంలో రైతులకు వరి విత్తనాల పంపిణీని శుక్రవారం ప్రారంభించారు. విత్తనాల కోసం రైతులు ఆందోళన చెందొద్దని, ప్రతి ఒక్కరికీ విత్తనాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వీఏఏ ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో చేరండి

గజపతినగరం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, పౌష్టికాహారం అందిస్తున్నామని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న వసతులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రచార రథాన్ని స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ప్రారంభించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అడ్మిషన్లపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్ రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్

బడిఈడు పిల్లల గుర్తింపు సర్వే..

మెరకముడిదాం: మండలంలోని కొండలావేరు గ్రామంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.సోమేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ చెల్లూరు రామకృష్ణ, సీఆర్పీ రెడ్డి శంకరరావు శుక్రవారం గ్రామంలో బడి ఈడు పిల్లల గుర్తింపు సర్వే చేపట్టారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి 10 మంది పిల్లలను ఒకటో తరగతిలో చేర్పించారు. బడి బయటి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు.

జిందాల్ కార్మికుల రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం సమీపంలో ఉన్న జిందాల్ స్టీల్ కర్మాగార కార్మికులు శుక్రవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కర్మాగార యాజమాన్యం కార్మికులపై చూపిస్తున్న మొండి వైఖరికి నిరసనగా కార్మిక సంఘ జేఏసీ నాయకులు నెక్కల నాయుడుబాబు, పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు, నమ్మి చిన్నబాబు, సురేష్, తదితర నాయకుల ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. పలువురు ప్రజాప్రతినిధులు దీక్షకు సంఘీభావం తెలిపారు. గత నెల 17న ముడిసరుకు కొరత చూపుతూ లాకౌట్ పేరుతో కర్మాగారాన్ని అర్థాంతరంగా మూసివేశారు. నాటి నుంచి కార్మికులు శాంతియుతంగా తమ నిరసన తెలియజేస్తున్నారు. అయినా కంపెనీ యాజమాన్యం స్పందించకపోవడంతో రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్లు కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు భీమయ్య, బొట్ట రాము, లగుడు వామాలు, పప్పల బంగారునాయుడు పాల్గొన్నారు.

సోంపురంలో పాఠశాలలో ఎకో క్లబ్ ప్రారంభం



ఎకో క్లబ్ ఆవశ్యకతను వివరిస్తున్న హెచ్‌ఎం బీపీఏ రాజు

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌జీసీ ఎకో క్లబ్ ప్రారంభించినట్లు పాఠశాల హెచ్‌ఎం బీపీఏ రాజు తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఎకోక్లబ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రకృతి నడక, వ్యర్థాల తగ్గింపు, శక్తి పొదుపు, పీఎం సోలార్, కిచెన్ గార్డెన్, నీటి వృథా తదితర అంశాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ ప్రదేశాల సందర్శన, జీవ వైవిధ్య సమాచార సేకరణలో విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నట్లు వివరించారు. పాఠశాలలో ఎన్‌జీసీ (జాతీయ హరిత దళం) ఏకో జట్టు (నేల, నీరు, శక్తి, పరిశుభ్రత, జీవవైవిధ్యం) ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షురాలు ఎల్.నూకరత్నం, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఎం.గౌరీ, రవిశంకర్ తదతరులు పాల్గొన్నారు.